

భక్తి మార్గం.. సేవా పరిమళం

ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రానికి వచ్చే భక్తులకు సేవలందిస్తూ సేవా దళ, సేవా సమితుల సభ్యులు స్వామి సేవలో తరిస్తున్నారు. 8లో ▸



వరాల వెంకన్నకు పూజలు

అత్తిలి: ఈడూరులోని వరాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

హనుమద్ జయంతికి ముస్తాబు

ద్వారకాతిరుమల: హనుమద్ జయంతి వేడుకలకు శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన అభయాంజనేయుని ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆదివారం ప్రత్యేక పూజలు జరుగనున్నాయి.



న్యూస్‌రీల్

1,413 పాఠశాలలకు 'విద్యా కానుక'



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

తాడేపల్లిగూడెం రూరల్: పాఠశాలలు పునఃప్రారంభమైన తొలి రోజునే 1,413 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం తాడేపల్లిగూడెం పట్టణ పరిధి పడాల పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి నాల్గో విడతగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేల విలువైన విద్యా కానుక కిట్లను అందజేస్తామన్నారు. అనంతరం పెంటపాడు పోస్టు బేసిక్ స్కూలులో జేవీకే కిట్లను ఆమె పరిశీలించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ వీఎస్.వేణుగోపాల్, ఎంఈవో వి.హను ఆమె వెంట ఉన్నారు.

పెంటపాడులో..

పెంటపాడు: పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాలలోని జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్ వద్ద కిట్లు, డ్రెస్‌లు, బ్యాగులను కలెక్టర్ పి.ప్రశాంతి తనిఖీ చేశారు. విద్యా కానుక కిట్లు ఎలా ఉపయోగపడుతున్నాయని విద్యార్థులను ఆరా తీశారు. ఏకరీతి కుట్టు చార్జీలను కూడా తల్లుల ఖాతాలో వేయనున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులకు శ్రమ లేకుండా విద్యార్థులు చదువుల్లో రాణించాలనే ప్రభుత్వం విద్యా కానుక అందిస్తోందన్నారు. తహసీల్దార్ శేషగిరిరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ టీవీ సత్యనారాయణ, ఎంఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి 'సాక్షి' ఆధ్వర్యంలో చెస్ శిక్షణ

సాక్షి, భీమవరం: 'సాక్షి' ఆధ్వర్యంలో భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్కు వద్ద ఆదిత్య కళావేదికపై సోమవారం నుంచి చదరంగంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీ సహకారంతో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ క్రీడాకారులకు రెండు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇస్తారు. ఈనెల 17న చెస్ పోటీలు నిర్వహించి 'సాక్షి' ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తారు. శిక్షణా కార్యక్రమాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కిషోర్ కోరారు. వివరాలకు సెల్ 98499 32767 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో 5,677 కేసుల పరిష్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లలో 5,677 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ తెలిపారు. మొత్తంగా 5,270 క్రిమినల్, 105 సివిల్, 196 ప్రీ లిటిగేషన్ కేసులు, 106 మోటారు వాహన ప్రమాద క్లెయిములు పరిష్కరించి రూ.4,93,20,105 నష్టపరిహారం మంజూరుకు అవార్డులు జారీ చేశామని పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.రాజేశ్వరి మాట్లాడుతూ ఏలూరులో 1,697, తాడేపల్లిగూడెంలో 695, తణుకులో 257, కొవ్వూరులో 1,019, నరసాపురంలో 692, భీమవరంలో 726, చింతలపూడిలో 156, పాలకొల్లులో 84, జంగారెడ్డిగూడెంలో 351 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. ఏలూరులోని జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్, ఇతర న్యాయమూర్తులు, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ కుమార్, ఏలూరు డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వర రావు, వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.



'అమ్మ' లేకపోతే జననం లేదు.. 'అమ్మ' లేకపోతే గమనం లేదు.. 'అమ్మ' లేకపోతే ఈ సృష్టిలో జీవం లేదు.. 'అమ్మ' లేకపోతే అసలు సృష్టే లేదు.. బిడ్డలకు ఆది గురువై.. సేవాతత్వానికి నిలువెత్తు నిదర్శనమై.. జీవితాంతం పిల్లల సంతోషం కోసం శ్రమించే దేవత అమ్మ.. తల్లులందరికీ అంతర్జాతీయ మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. తమ పిల్లలకు అన్నీ తామై.. అంతటా తామై.. నిరంతరం శ్రమిస్తున్న మాతృమూర్తుల వివరాలు మీ కోసం..

– భీమవరం(ప్రకాశం చౌక్)/బుట్టాయగూడెం/కైకలూరు

కదిలే దేవత అమ్మ..

మాతృ దినోత్సవం

అమ్మ ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి..



నేను ఈ రోజు జిల్లా కలెక్టర్‌గా ప్రజలకు సేవలందించే స్థాయికి వచ్చానంటే మా అమ్మ సుజాత కష్టం, ప్రోత్సాహం ఎంతో ఉంది. అమ్మ ఇంటర్ మాత్రమే చదివినా.. చదువులో నన్ను బాగా ప్రోత్సహించారు. నేను రాత్రంతా చదువుతూ ఉంటే నాతోపాటు ఆమె మేల్కొని ఉండేవారు. నాకు కావాల్సినవి అన్నీ సమకూర్చి చదివించేవారు. నేను ఉద్యోగం సాధించే వరకూ ఆమె ఇచ్చిన ప్రోత్సాహం ఎన్నటికీ మరువలేను. ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆమె ఇప్పటికీ దీవిస్తుంటారు. మా అమ్మకు, మాతృమూర్తులందరికీ మదర్స్‌డే శుభాకాంక్షలు.

–పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి

నా విజయం వెనుక అమ్మ కష్టం



ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే నా విజయం వెనుక మా అమ్మ ఏళ్ల తరబడి కష్టం దాగి ఉంది. అమ్మ పేరు మరియమ్మ. 11 మంది సంతానం. సరైన సౌకర్యాలు లేని ఆ రోజుల్లో ఓ పక్క టీచరుగా పనిచేస్తూ.. మరోపక్క మా 11 మందిని బాధ్యతతో ఎంతో ప్రేమగా చూసుకునేవారు. ఆమె టీచరు కావడంతో చదువులో మమ్మల్ని బాగా ప్రోత్సహించారు. ఏ కష్టం రాకుండా అన్నీ సమకూర్చేవారు. నేను ఉద్యోగం సాధించే వరకూ నా వెన్నంటే ఉండి నడిపించారు. మా అమ్మతో పాటు మాతృమూర్తులందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు.

– ఉప్పాడ రవిప్రకాష్, జిల్లా ఎస్పీ, పశ్చిమగోదావరి

29 ఏళ్లుగా చంటి బిడ్డలా సాకుతూ..



కుమారుడికి అన్నం తినిపిస్తున్న తల్లి పర్వీన్

తొలిచూరు మగ బిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లి మురిసిపోయింది. బిడ్డను ప్రయోజకుడిని చేయాలని కలలు కన్నది. అయితే మూడు నెలలకే శిశువు మూగవాడిగా, మానసిక స్థితి సరిగా లేనివాడిగా ఉన్నట్టు గమనించింది. వైద్యుల వద్దకు తీసుకువెళితే జీవితాంతం ఇలానే ఉంటాడని చెప్పడంతో తల్లడిల్లిపోయింది. బిడ్డను భగవంతుని వరంలా భావిస్తూ అప్పటినుంచి అన్నీ తానై 29 ఏళ్లుగా కొడుకును చూసుకుంటోంది బుట్టాయగూడేనికి చెందిన సయ్యద్ పర్వీన్. అమ్మ అనే పదానికి నిలువెత్తు నిదర్శనంగా.. సేవామూర్తిగా కొడుకు అనర్ బాషాకు సేవలందిస్తోంది. అనర్ బాషాకు ఏ పనీ చేతకాదు, కనీసం అన్నం తినడం రాదు, స్నానం చేయడం రాదు. అయినా తల్లి పర్వీన్ కనుపాపలా కాపాడుకుంటూ వస్తోంది. ఆరు నెలల క్రితం భర్త హిమాం మృతి చెందగా కుటుంబ భారం ఆమెపై పడింది. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తో ఆమె కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.



కుమార్తె యాస్మిన్‌తో తల్లి నసీమాబేగం

గురువుగా మారి.. స్వస్థత చేకూర్చి..

వైకల్యం బిడ్డ శరీరానికే గాని అమ్మ మనసుకు కాదని నిరూపిస్తున్నారు కైకలూరుకు చెందిన ఎస్‌కే నసీమాబేగం. ఆమెకు ఇద్దరు సంతానం. భర్త ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కూతురు యాష్మిన్ బేగం (12)కు పుట్టుకతో సెరిబ్రల్ పాల్సీ అనే వ్యాధి ఉంది. దీంతో ఆమె శరీర భాగాలు పనిచేయవు. అయినా తల్లి నసీమా ఏమాత్రం కుంగిపోలేదు. కుమార్తెకు ఏడేళ్ల వయసులో శస్త్ర చికిత్స చేయించారు. ఆమె గురువుగా మారింది. కైకలూరులో ప్రత్యేక అవసరాల కలిగిన పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే భవిత కేంద్రంలో చేర్పించింది. ప్రతి వారం ఫిజియోథెరపీ చేయిస్తోంది. స్థానిక ఉర్దూ స్కూల్‌కు బిడ్డను తీసుకువెళ్లి పాఠాలు చెప్పిస్తోంది. బిడ్డపై తల్లి ప్రేమను సమీప నివాసితులు అభినందిస్తున్నారు. తల్లి నసీమా బేగం మాట్లాడుతూ పిల్లలకు చిన్నపాటి సమస్యలు ఉత్పన్నమైనప్పుడు తల్లులు విచారించడం మాని స్వస్థత చేకూర్చే పద్ధతులపై దృష్టి సారించాలని అంటున్నారు.

అన్నీ తానై.. భవితకు వెలుగై..





వీల్‌చైర్‌కు పరిమితమైన సంజన, (అంతరచిత్రం) తల్లి ఎస్తేరురాణి

కైకలూరు మండలం వరహాపట్నం గ్రామంలో రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం వారిది. భర్త ఆటో డ్రైవర్. వీరికి బాబు, పాప సంతానం. మేనరికపు వివాహం కారణంగా కుమార్తె పాము సంజన (11)కు మస్క్యులర్ డిస్ట్రోపి (కండర క్షీణత) వ్యాధి సోకింది. తల్లిదండ్రులు కొంతకాలం తర్వాత దీనిని గుర్తించారు. సంజన కండరాల క్షీణత కారణంగా వీల్‌చైర్‌కే పరిమితమైంది. అరుదుగా వచ్చే ఈ వ్యాధితో రానున్న రోజుల్లో బెడ్‌కే పరిమితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు చెప్పారు. అయినా బిడ్డపై మమకారంతో తల్లి ఎస్తేరురాణి వైద్య సేవలు అందిస్తోంది. బిడ్డకు చదువు నేర్పుతోంది. కైకలూరు భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ చేయిస్తోంది. తల్లుల దినోత్సవం సందర్భంగా ఎస్తేరురాణి మాట్లాడుతూ తల్లికి బిడ్డ ఎప్పుడూ భారం కాదని, తన బిడ్డ ఎంతో తెలివైనది అన్నారు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నా ఆమెకు అన్నీ తానై సాకుతున్నానని చెప్పారు.

సమష్టి కృషితో 'నన్నయ' అభివృద్ధి

నూతన వీసీ ఆచార్య పద్మరాజు పిలుపు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య పద్మరాజు

రాజానగరం (తూర్పు గోదావరి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని సిబ్బందికి నూతన ఉప కులపతి (వైస్ చాన్సలర్) ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు పిలుపునిచ్చారు. నూతన వీసీగా వర్సిటీలోని చాంబర్‌లో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ ముఖద్వారం వద్ద బోధన, బోధనేతర సిబ్బంది మేళతాళాలు, వేద పండితుల ఆశీర్వచనాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముఖ ద్వారం వద్ద ఉన్న ఆదికవి నన్నయ విగ్రహానికి, సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆచార్య పద్మరాజు పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి వీసీగా ఉన్న జేఎన్‌టీయూకే వీసీ ఆచార్య జీవీ ఆర్.ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తదితరుల సమక్షంలో రిజిస్టర్‌లో సంతకం చేసి, బాధ్యతలు చేపట్టారు. అనంతరం వర్సిటీ కన్వెన్షన్ హాలులో సిబ్బందితో ఆచార్య పద్మరాజు సమావేశమయ్యారు. తనను వీసీగా నియమించేందుకు కారకులైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్య స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్యామలరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న సీఎం విజన్‌ను దృష్టిలో పెట్టుకుని, నూతన విద్యా విధానం అమలుకు, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. గోదావరి జిల్లాల్లో అపారంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు పనిచేద్దామని అన్నారు. ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని ఆచార్య పద్మరాజు చెప్పారు. అనంతరం వర్సిటీ కేంద్ర పాలనా భవనంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ రూమును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధ జంటకు ఆశ్రయం



అప్పారావు, కన్నమ్మలకు ఆశ్రయం కల్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరం హిందూ శ్మశాన వాటికలో నిరాశ్రయులుగా ఉన్న వృద్ధ దంపతులు ముర్పి అప్పారావు, కన్నమ్మ దంపతులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు శనివారం ఆశ్రయం కల్పించారు. శ్మశాన వాటికలో నిరాశ్రయులుగా ఉన్న వృద్ధ దంపతుల విషయం మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో వీరంతా స్పందించారు. స్థానిక తులసి కల్యాణ మండపంలో వసతి, భోజనం ఏర్పాటు చేశారు. నక్కెల్ల శివరామకృష్ణ, ఎంపీటీసీ గుల్లిపల్లి విజయలక్ష్మి, కందుల సురేష్, ఆర్ఐ రూజ్‌వెల్ట్, నారాయణ గిరీష్ తదితరుల సహకారంతో ఈ వృద్ధ జంటకు ఆశ్రయం కల్పించారు. అప్పారావుకి ఎస్సై రమేష్ సపర్యలు చేసి కొత్త దుస్తులు అందజేశారు.

గంజాయి ముఠా అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొవ్వాడలోని కోళ్ల షెడ్డు వద్ద గంజాయి ముఠాను శనివారం అరెస్ట్ చేసినట్టు ఎస్సై బి.మోహన్‌రావు తెలిపారు. సింగం సుబ్బారావు, మరో ఐదు గురిని అదుపులోకి తీసుకుని, ఏడు కేజీల గంజా యిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ మేర కు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

భక్తి మార్గం.. సేవా పరిమళం..

శ్రీవారి దర్శనం భక్తులకు ప్రీతిపాత్రం. అదే తమకు మోక్షమార్గమని భావిస్తుంటారు భక్తులు. ఇక ఏకంగా శ్రీవారి సేవలో తరించే అవకాశమే వస్తే.. ఆ ఆనందం అద్వితీయం. అందులో భాగంగానే సేవా వలంటీర్ల రూపంలో ద్వారకాతిరుమల చిన వెంకన్న కొండపై తమ సేవలందిస్తూ తరిస్తున్నారు అనేకమంది భక్తులు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు సేవలందిస్తే.. స్వయంగా ఆ శ్రీవారికే సేవ చేసిన అనుభూతి కలుగుతుందనేది వారి అభిప్రాయం.

- శ్రీవారి భక్తులకు వలంటీర్ల స్వచ్ఛంద సేవలు
- అన్నదాన భవనం, దర్శనం క్యూలైన్లు ఇతర విభాగాల్లో సేవకు అవకాశం
- స్వామివారికే సేవ చేస్తున్నట్టుగా అనుభూతి

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : మానవ సేవే మాధవ సేవ అంటారు.. అంటే తోటి మనుషులకు చేసే సేవ ఆ దేవుడికి చేసే సేవేననేది దీని తాత్పర్యం. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్యం ఇలా సేవా వలంటీర్లుగా స్వచ్ఛంద సేవ అందించే భక్తులు పెద్ద సంఖ్యలో ఉంటారు. అదేవిధంగా ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలోనూ భక్తులు తమ స్వచ్ఛంద సేవతో భక్తి పరిమళాలు వెదజల్లుతున్నారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు సేవలందిస్తూ సేవా దళ సభ్యులు స్వామి సేవలో తరిస్తున్నారు. అన్నదాన భవనంలో విస్తరి వేసి.. అన్నప్రసాదాన్ని వడ్డించింది మొదలు, విస్తరి తీసి సామగ్రిని శుభ్రం చేసే వరకు వీరి సేవలు నిత్యం కొనసాగుతున్నాయి. దర్శనం క్యూలైన్లలో నిరంతరాయంగా భక్తులకు మంచినీరు అందించడంతో పాటు పలు సపర్యలు చేస్తూ సేవకు హద్దులు లేవని నిరూపిస్తున్నారు.

సండే స్పెషల్



భక్తుల భోజనాల అనంతరం విస్తర్లు తీస్తున్న సేవకురాలు

సేవలు ఇలా...

చిన వెంకన్న క్షేత్రానికి ప్రతి శని, ఆదివారాల్లో వేలాదిగా వచ్చే భక్తులకు సేవా దళ, సేవా సమితుల సభ్యులు తమ సేవలను అందిస్తున్నారు. ముఖ్యంగా కొండపైన నిత్యాన్నదాన భవనంలో అన్నప్రసాదాన్ని వడ్డించడం, ఆలయంలో దర్శనం క్యూలైన్ల వద్ద భక్తులను వేగంగా ముందుకు పంపించడం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూ లైన్లు, ప్రసాదాల విక్రయ కౌంటర్ల వద్ద భక్తులకు మంచినీటిని అందించడం వంటి పనులు చేస్తున్నారు.



కొండపైన ఘాట్ రోడ్డు పక్కన చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న సేవకులు

200 మందికి పైగా సేవకులతో..

ప్రతి శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో 200 మందికి పైగా వలంటీర్లు భక్తులకు తమ సేవలను అందిస్తున్నారు. ఎక్కువగా హైదరాబాద్, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, తణుకు, శ్రీకాకుళం, విజయనగరం, రావులపాలెం, నీలాద్రిపురం, ఏలూరు, పెన్నాడ, కైకలూరు, మండపాక తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు బృందాలుగా ఏర్పడి ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.



స్వామివారి అన్నప్రసాద సేవలో వలంటీర్లు

నిబంధనలు ఇలా...

- స్వచ్ఛంద సేవా వలంటీర్లకు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విధులు ఉంటాయి.
- కాషాయం లేదా పసుపు రంగు దుస్తులు ధరించాలి. దేవస్థానం వారు శ్రీవారి సేవ అని రాసివున్న కండువాలను అందిస్తారు. వాటిని మెడలో వేసుకుని సేవలో పాల్గొనాలి.
- దూరప్రాంతాల నుంచి వచ్చే వలంటీర్లు రెండు, మూడు రోజులు ఆలయంలో ఉండటానికి అనుమతిస్తారు.
- ఉదయం అల్పాహారంగా పులిహోర లేదా ఉప్మాను దేవస్థానం వారు అందిస్తారు. మధ్యాహ్నం భోజనం, రాత్రి కూడా బస చేసే వారికి భోజనాన్ని అన్నదాన సదనంలోనే అందజేస్తారు. ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పిస్తారు.
- వీరికి స్వామివారి ఉచిత దర్శనం మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 7 గంటలకు కల్పిస్తారు.
- భక్తులకు అందించే ఉచిత ప్రసాదాన్నే వీరికీ అందిస్తారు.
- సేవా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యే వలంటీర్లు మిగిలిన భక్తులను గోవిందా.. అనే సంబోధించాలి. ఆలయంలో సేవలో ఉన్న సమయంలో గోవింద నామ జపం చేయాలి.

ఆలయ శుభ్రతలో సైతం..

ఆలయ శుభ్రతలో సైతం వలంటీర్లు భాగస్వాములవుతున్నారు. ఏప్రిల్ నాలుగు, ఐదు తేదీల్లో శ్రీ భ్రమరాంబిక సేవాసమితి, శ్రీ వద్దిపర్తి పద్మాకర్‌కు చెందిన గుడి–బడి శిష్య బందం, తమిళనాడుకు చెందిన జగద్గురు సేవా బృందం సభ్యులు సుమారు 250 మంది ఆలయ శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా ఆలయ పరిసరాలు, కల్యాణ కట్ట, గోసంరక్షణశాల, దర్శనం క్యూలైన్లు, మండపాలు, దేవతామూర్తుల విగ్రహాలు, పూజా సామగ్రితో పాటు పలు ప్రాంతాలను ఊడ్చి, కడిగి శుభ్రం చేశారు. కొండపైన ఘాట్ రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.

సేవలో పాల్గొనాలంటే..

సేవలో పాల్గొనదలచిన భక్తులు ముందుగా శ్రీవారి కొండపైన వకుళమాత నిత్యాన్నదాన కార్యాలయానికి వెళ్లి తమ ఆధార్ కార్డులను చూపాలి. ఆ తరువాత అక్కడి అధికారులు సూచించిన ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టాలి. సేవలో పాల్గొన్న వారికి స్వామివారి ఉచిత దర్శనం, భోజనం, వసతి సౌకర్యాన్ని దేవస్థానం కల్పిస్తుంది. ఫోన్ ద్వారా అయితే 08829 – 271427 నంబరులో సంప్రదించాలి.

సంతృప్తినిస్తోంది



భక్తులకు సేవలందిస్తే.. స్వయంగా ఆ శ్రీవారికే సేవ చేసిన అనుభూతి కలుగుతుంది. ఎన్నో ఏళ్లుగా చినవెంకన్న ఆలయంలో భక్తులకు సేవలందిస్తున్నాను. అన్నదాన భవనంలో భక్తులకు స్వామివారి అన్నప్రసాదాన్ని అందించడం, విస్తర్లు తీయడం వంటి పనులు చేస్తాను. ఈ సేవ నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. ఇక్కడి అధికారులు సేవకులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు.

– జి.వరలక్ష్మి, సేవాదళ సభ్యురాలు, తాడేపల్లిగూడెం

ఇదే తొలిసారి...



శ్రీవారి ఆలయంలో సేవ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. ఇప్పటికి కుదిరింది. సేవలో పాల్గొన్న తొలిరోజు భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించడం సంతృప్తినిచ్చింది. సేవకులకు స్వామివారి ప్రత్యేక దర్శనంతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను ఆలయ అధికారులు అందించారు. ఇకపై ప్రతి శనివారం సేవలో పాల్గొనాలని అనుకుంటున్నాను.

– ఓగిడి పద్మ, సేవాదళ సభ్యురాలు, తణుకు

పెరుగుతున్న ఆధ్యాత్మిక చింతన



సేవకుల్లో ఆధ్యాత్మిక చింతన నానాటికీ పెరుగుతోంది. మానసిక ప్రశాంతత, దేవునిపై భక్తితో వందలాది మంది సేవామార్గం వైపు అడుగులు వేస్తున్నారు. శ్రీవారి దేవస్థానంలో సేవ చేసేందుకు ఎంతోమంది ఆసక్తి చూపుతున్నారు. ప్రతి శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో భక్తులకు పలు సేవాదళాలు, సేవాసమితి సభ్యులు అందిస్తున్న సేవలు గొప్పగా ఉంటున్నాయి. సేవకులకు దేవస్థానం నుంచి అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నాం.

– వేండ్ర త్రినాధరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

సంక్షేమ పాలనపై సంతృప్తి



పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణంలోని 22వ వార్డులో వృద్ధురాలితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, నాయకులు

హిజ్రా దారుణ హత్య

ఆలమూరు: జొన్నాడ బస్టాండ్ సమీపాన జాతీయ రహదారి పక్కన ఓ హిజ్రా దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన మరిపట్ల ఆనంద్ ఆలియాస్ ఆనంది (33) కొన్నేళ్లుగా ధవళేశ్వరంలో నివాసం ఉంటోంది. అమ్మానాన్నలను చూసేందుకు వెళ్తానంటూ ఆమె కొంత నగదుతో బయలుదేరినట్టు సహచర హిజ్రాలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జొన్నాడలోని 216ఎ జాతీయ రహదారి పక్కన పంట కాలువ డ్యామ్ సమీపాన పశువుల పాక చెంతన ఉన్న పంట కాలువలో ఆమె మృతదేహం కనిపించింది. ఆమెను పాశవికంగా హతమార్చిన దుండగులు ఆమె మృతదేహాన్ని పంట కాలువలో కుక్కేశారు. ఆనంది మృతదేహాన్ని గుర్తించిన స్థానిక రైతు సత్తి సత్యనారాయణరెడ్డి పోలీసులకు సమాచారం అందించారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ నేతృత్వంలో రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, ఎస్సైలు ఎం.వెంకటరమణ, ఎస్.శివప్రసాద్‌లు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాకినాడ నుంచి వేలిముద్ర నిపుణుడు కె.ప్రవీణ్‌కుమార్ బృందం, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేసి ఆధారాలు సేకరించారు. అక్కడ లభించిన ఆనవాళ్లను బట్టి హత్యకు ముందు తీవ్ర పెనుగులాట జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. హంతకులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్సై శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆనంది హత్య విషయం తెలియడంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నలు మూలల నుంచీ అధిక సంఖ్యలో హిజ్రాలు ఘటనా స్థలానికి తరలివచ్చారు. మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. పోలీసులకు అనుమానితుల పేర్లు అందించి, ఆ దిశగా విచారణ చేయాలని అభ్యర్థించారు.



ఆనంది (ఫైల్)

శ్రీవారి కొండపై బస్సు క్లీనర్ల వీరంగం

మద్యం మత్తులో హల్‌చల్

ద్వారకాతిరుమల: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల క్లీనర్లు ఇద్దరు మద్యం మత్తులో శ్రీవారి కొండపై శనివారం సాయంత్రం వీరంగం సృష్టించారు. భక్తులను, ఆలయ ఉద్యోగులను, పోలీస్ సిబ్బందిని హడలెత్తించారు. ఎస్సై టి.సుధీర్ రంగప్రవేశం చేసి క్లీనర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. బస్సులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. నిత్యం హైదరాబాద్ నుంచి ద్వారకాతిరుమలకు వచ్చే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను శ్రీవారి కొండపై ఉన్న సెంట్రల్ పార్కింగ్‌లో పార్క్ చేస్తున్నారు. నాలుగు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను శనివారం ఉదయం పార్క్ చేశారు. ఈ బస్సులు రాత్రి ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉంది. అయితే ఎల్‌వీపీ ట్రావెల్స్‌కు చెందిన క్లీనర్ తంజుం ఆకాష్ రెడ్డి, అట్లూరి ట్రావెల్స్‌కు చెందిన క్లీనర్ చాకిలం బాబ్జిలు పూటుగా మద్యం తాగి తొలుత ఒక బస్సు డ్రైవర్‌పై దాడి చేశారు. ఆ సమయంలో అక్కడికెళ్లిన దేవస్థానం సిబ్బంది, పోలీసులపైనా వారు దురుసుగా ప్రవర్తించారు. ఒక స్వీపర్‌పై దాడి చేశారు. తన దగ్గరకు రావద్దంటూ ఆకాష్‌రెడ్డి బస్సుపైకెక్కి తన చేతిని కోసుకున్నాడు. ఆ సమయంలో బాబ్జి అట్లూరి ట్రావెల్స్ బస్సును వేగంగా నడుపుకుంటూ కొండ కిందకు వెళ్లిపోయాడు. వెంబడించిన పోలీసులు అంబేడ్కర్ సెంటర్‌లో బస్సును నిలుపుదల చేసి, అడ్డం పగలగొట్టి మరీ బాబ్జిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే ఆకాష్‌రెడ్డి పరారయ్యేందుకు బస్సును పార్కింగ్ లోంచి తీసే క్రమంలో బస్సు ఒక చెట్టును ఢీకొట్టి నిలిచిపోయింది. అతడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను కొండపైకి రాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.



సెంట్రల్ పార్కింగ్‌లో వీరంగం సృష్టిస్తున్న క్లీనర్

రొయ్యల ధరలు తగ్గుదల పుకార్లే

భీమవరం(ప్రకాశం చౌక్): వాతావరణ మార్పులతో మిడిల్ ఆర్వెస్ట్ పెరిగి రొయ్యల ధరలు తగ్గుతాయనే పుకార్లను నమ్మవద్దని ది ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ పవన్‌కుమార్ రైతులకు ఓ ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం 30 కౌంట్ రొయ్యలను రూ.440కు, 100 కౌంట్ రొయ్యలను రూ.240కు కొంటున్నట్టు పేర్కొన్నారు. ధరలు తగ్గింపునకు అవకాశం లేకపోవచ్చని పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి



ఘటనా స్థలంలో మృతి చెందిన యువకుడు, మణికంఠ సాయిశేఖర్ తాతయ్య (ఫైల్)

తణుకు: తణుకు రైల్వే స్టేషన్‌లో శనివారం రైలు దిగుతూ జారిపడి యువకుడు మృతి చెందాడు. పెరవలి మండలం నల్లాకులవారిపాలెం గ్రామానికి చెందిన కోలా నాగమణికంఠ సాయిశేఖర్ తాతయ్య (23) మిత్రులతో కలిసి కాకినాడ నుంచి తణుకు బయల్దేరాడు. సాయిశేఖర్ తాతయ్యతో పాటు మిత్రులంతా కలిసి రైలు ముందు భాగంలోని జనరల్ బోగీలో ఎక్కారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో రైల్వేస్టేషన్‌లో ప్రవేశిస్తున్న సమయంలో గుమ్మం వద్ద ఉన్న సాయిశేఖర్ తాతయ్య రైలు దిగే క్రమంలో ప్రమాదవశాత్తూ ప్లాట్‌ఫారం, రైలుకు మధ్య జారిపడిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో దాదాపు గంటసేపు సర్కార్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. సాయిశేఖర్ తాతయ్య ఇటీవల బీటెక్ పూర్తి చేసి మిత్రులతో కలిసి శనివారం యానాం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఇన్‌చార్జి రైల్వే స్టేషన్ మాస్టర్ జీఎస్ఎస్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమవరం రైల్వే ఎస్సై పీటీవీ రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

యలమంచిలి: వద్దిలంక గ్రామానికి చెందిన శిరిగినీడి ముసలయ్య (52) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన ముసలయ్య ఇంట్లో డబ్బులు ఇవ్వడంలేదని మనస్థాపానికి గురై పురుగుమందు తాగాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మరణించాడు. ముసలయ్య కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఏఎస్సై ఎస్‌కే దుర్గారావు తెలిపారు.

క్లుప్తంగా

పోస్టల్‌శాఖ పథకాలపై విద్యార్థులకు అవగాహన



అత్తిలిలో పోస్టల్‌శాఖ పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పోస్టల్‌శాఖ ప్రవేశపెట్టిన పలు పథకాలపై పోస్టమాస్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు అవగాహన కల్పించారు. పోస్టల్‌శాఖ కల్పిస్తున్న సేవింగ్స్ ఖాతాలు తెరవడం, ఫిక్సిడ్ డిపాజిట్లు, అధార్‌వంటి పలు సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, రిటైర్డు గ్రంథాలయాధికారి గంధం శేషవేంద్రరావు, ఎ బాలాజీ, వి లక్ష్మణరావు, పి వెంకటేశ్వరరావు, ఎం శ్రీదేవి, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజ్ఞాన తరగతులు



గూడెం పట్టణంలో వేసవి శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్ -1 శాఖ గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణా తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 6వ రోజు శనివారం విద్యార్థినీ విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. లెక్కలు, ఇంగ్లీషు స్టోరీలు, గ్రామర్, తెలుగు, హిందీ, దేశభక్తి గీతాలు నేర్పించారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు మహాశివ భట్టు లక్ష్మణరాజు, ఎ.జనార్ధనరావు, ప్రత్తి వీరాస్వామి, ఎన్.సాల్మన్ రాజు, పీజీ స్టూడెంట్ సుంజులు విద్యార్థులకు వివిధ అంశాలలో అవగాహన చేశారు.

జగనన్న కాలనీలు త్వరగా పూర్తి చేయాలి

తణుకు టౌన్: మండలంలోని జగనన్న కాలనీలు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. శనివారం వేల్పూరు గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో తేడా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఆప్షన్ త్రీ నిర్మాణాలు వేగం పెంచాలని తెలిపారు. కాలనీలో త్వరలోనే విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మూర్తి, హౌసింగ్ ఏఇ, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంచుకోవాలి

సాక్షి, భీమవరం: ప్రతి వ్యక్తి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలన్న విధి నిర్వహణలో తన నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలన్నా సాధన తోనే సాధ్యమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ కే.వీ సుబ్బరాజు పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ది ఇంటర్నల్ క్వాలిటీ అసెస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మనసులోని భావాలను వృద్ధి చేసుకోవడం అనే అంశంపై ఇంజినీరింగ్ యువ అధ్యాపకులకు రెండు రోజులు పాటు ప్రత్యేక శిక్షణ శనివారం అందించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వేణు రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో డాక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ సాధన తో సాధించలేనిది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వేణురెడ్డి పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో అన్నసమారాధన

కాళ్ళ: మండలంలోని స్వయంభూ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శని వారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహో త్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు.

రాజీ లేకుండా అభివృద్ధి పనులు

ఉండి: నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా జగనన్న గృహాలు నిర్మిస్తున్నామని చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవేటీ సాంబశివరావు అన్నారు. శనివారం గ్రామంలోని అలుగులమ్మ లేఅవుట్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు కొండవేటి సాంబశివరావు, కార్యదర్శి కే గోపాలకృష్ణ, వీఆర్వో ఎస్ చిన్నారావు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి వేండ్ర గ్రామానికి చెందిన కళారి సీతమ్మ 14.370 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు



తణుకు కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి పి.అన్నపూర్ణ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లోక్ అదాలత్‌లో కేసులను సత్వర పరిష్కారం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు తెలిపారు. తాడేపల్లిగూడెం కోర్టు భవనాల ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ప్రకాశ్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్య కిరణ్ శ్రీ, రెండోవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి అన్నామణిలు వివిధ కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం చేసుకొంటే సమయం, సొమ్ములు ఆదా అవుతాయని తెలిపారు. రాజీ మార్గం రాజ మార్గమని ఇరు కక్షిదారులు విజయం సాధించినట్లు అవుతుందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, ఈపీ, జేపీ, హెచ్ఎంటీపీలు, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్ కేసులు, బెంచ్ కోర్టు కేసులను రాజీ చేశారు. 695 కేసులకు గాను 76,56,000 రూపాయిలు పరిష్కారం చూపారు. ఈ కార్యక్రమంలో టౌన్, రూరల్ సీఐలు ఎస్ఎస్‌వీ నాగరాజు, ఎస్‌వీవీఎస్ మూర్తి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 245 కేసులు పరిష్కారం....

తణుకు అర్బన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తణుకు కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు 245 కేసులు పరిష్కరించారు. నాల్గవ అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ అధ్యక్షతన 3 బెంచ్‌లుగా నిర్వహించిన ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 1వ బెంచ్‌కు నాల్గవ అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ, అడ్వకేట్ మెంబరు కేపీవీఏఎస్ పవన్‌కుమార్, 2వ బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, అడ్వకేట్ మెంబరు ఎం.సుబ్బయ్య, 3వ బెంచ్‌కు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరామ్, అడ్వకేట్ మెంబరు డి.కృష్ణకుమారి వ్యవహరించారు. రూ. 1,40,76,334లు విలువగల 29 సివిల్, 76 క్రిమినల్, 120 పెట్టీ, 18 ప్రీలిటిగేషన్ కేసులు రాజీ అయ్యాయి. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

52 ఏళ్ల క్రితం కేసు పరిష్కారం...

తణుకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 52 ఏళ్ల క్రితం నాటి కేసు పరిష్కారం అయ్యింది. తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ చొరవతో నరసింహదేవర్ రామకృష్ణ, కూచిభట్ల నరసింహపేరయ్య శాస్త్రుల మధ్య దావా గత 52 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఈ కేసుకు సంబంధించి రెస్పాండెంట్ తరపు న్యాయవాదిగా సూరంపూడి కామేష్, పిటీషనర్ తరపు న్యాయవాదిగా వి.శశిధర్‌లు వ్యవహరించి కేసును పరిష్కరించుటలో కృషి చేసినందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు అభినందించినట్లు కామేష్ తెలిపారు. అనంతరం కక్షిదారులకు కామేష్ భోజన వసతి కల్పించారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



పెదఅమిరంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ళ: ప్రయాణికులు, వాహనదారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు.శనివారం రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఉన్న పెదమిరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి చలివేంద్రాల ఏర్పాటుతో ప్రయాణీకులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. చలివేంద్రాలను ప్రయాణీకులు వాహనదారులు వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, జవ్వాది సత్యనారాయణ, నడింపల్లి సుబ్బరాజు, బిరుదుగడ్డ రమేస్‌బాబు, గ్రామ పెద్దలు, పంచాయతీబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

అమృతఫలం... ఎంతో ప్రియం

- మామిడి దిగుబడి తగ్గి ధర పెరుగుదల
- అంతంత మాత్రంగా విక్రయాలు
- వర్షాలతో పండ్లకు పురుగుల బెడద



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బంగినిపల్లి రకం మామిడి పండ్లు

పెంటపాడు: వేసవి వస్తుందంటే అందరి మనసూ మామిడి పండ్లవైపే లాగేస్తుంది. అమృత ఫలమనే పేరు ఎలా వచ్చిందో తెలియదు కానీ నిజంగా ఒక్క చుక్క మామిడి రసం నాలుకపై పడినా ప్రాణం లేచి వస్తుందంటే అతియోశక్తి కాదు. అటువంటి పండు దేశ విదేశాల్లో ఎంత ప్రఖ్యాతమైనదో అర్థమవుతోంది. ఈ మామిడి ఈ ఏడాది అంతసులభంగా అందే పరిస్థితి కనిపించడంలేదు. దిగుబడి 50 శాతానికి పడిపోయింది. దీంతో సహజంగానే ధర అమాంతం పెరిగిపోతుంది. కార్బడ్ వంటి రసాయినాలతో కృత్రిమంగా పండిస్తే ఎక్కడ దొరికిపోతామో, శిక్ష పడుతుందో అని రైతులు, దళారులు ఆందోళన చెంది ఆ ప్రయత్నం విరమించుకొని సంప్రదాయ బద్ధంగా గడ్డిలో మగ్గిస్తున్నారు. మార్కెట్‌లో మామిడి విక్రయాలు తగ్గడానికి ఇది కూడా కారణంగా కనిపిస్తోంది. గత ఏడాది పరక పండ్లు రూ. 150 నుంచి 200 ఉంటే ఈ ఏడాది రూ. 250 నుంచి కాయనుబట్టి ఆపై ధర ఉంటోంది.

పచ్చికాయలు ఎగుమతి

చెట్ల నుంచి పచ్చికాయలు కోసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మామిడి కాయలను గ్రేడింగ్ చేసి పెద్దపెద్ద కంపెనీలకు పచ్చళ్ల తయారీకి, పండిన మామిడిని శీతలపానీయాల తయారీకి కొనుగోలు చేయడం వల్ల కొరత ఏర్పడింది.

20 ఏళ్లుగా వ్యాపారం



గత 20 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాను. ఈ ఏడాది దిగుబడి అంతగా లేదు. మే నెల ప్రారంభంలోనే మామిడి పండ్లు మార్కెట్‌ను ముంచెత్తేవి. మే నెలఖారు వస్తున్నా పూర్తిగా మామిడి పండ్లు రాలేదు. పస్తుతం తప్పక వ్యాపారం చేస్తున్నాము. రోజంతా విక్రయిస్తే రూ.500ల వరకూ వస్తుంది.

– గంగిరెడ్డి అప్పారావు, మామిడిపండ్ల వ్యాపారి

గడ్డిలో పండించేవారు తక్కువ



గతంలో మామిడి కాయలను సాంప్రదాయ బద్ధంగా మగ్గించేవారు. అవి ఎంతో మంచి సువాసనతో రుచిగా ఉండేవి. నేడు మామిడి పండ్లలో రంగే తప్ప, సువాసన కనిపించడంలేదు. పాత పద్ధతిలో గడ్డిలో మగ్గబెట్టేవారు కరువయ్యారు.

– గొర్రెల కోటేశ్వరరావు, పరిమెళ్ల

నేడు భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

యలమంచిలి: హనుమద్ జయంతి సందర్భంగా ఆదివారం చించినాడ నుంచి దొడ్డిపట్ల వరకు హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు భజరంగ్‌దళ్ కార్యకర్తలు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు చించినాడ బైపాస్ రోడ్డులో ఉన్న హనుమాన్ విగ్రహం నుంచి ప్రారంభమయ్యే ఈ బైక్ ర్యాలీ చించినాడ, యలమంచిలి, మేడపాడు, శిరగాలపల్లి, కట్టుపాలెం, ఇలపకుర్రు, సుంకరపాలెం, గుంపర్రు మీదుగా కాంభొట్లపాలెం వెళుతుంది. అక్కడి నుంచి యూటర్న్ తీసుకుని గుంపర్రు, ఇలపకుర్రు, కుమ్మరిపాలెం, అబ్బిరాజుపాలెం మీదుగా కొనసాగి దొడ్డిపట్ల సెంటర్లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం వరకు ఈ బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీ అనంతరం దొడ్డిపట్లలో భక్తులందరికీ అన్నసమారాధన జరుగుతుందని భజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు వివరించారు.

ఐటీఐ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

పెనుగొండ: ఆచంట ప్రభుత్వ ఐటీఐలో 2023–24 విద్యా సంవత్సర ప్రవేశాలకు గానూ మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యిందుకూరి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు. ఐటీఐలో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసి ప్రింట్‌ను, ధ్రువపత్రాల కాపీల నకళ్లను జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ప్రభుత్వ ఐటీఐ ఆచంటలో అందించాలని తెలిపారు. మిగిలిన వివరాలకు 94901 11002కు ఫోన చేయాలని సూచించారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన



చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అత్తిలిలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇరగవరం: తణుకులో చంద్రబాబు నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఇరగవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక బీసీ వర్గానికి చెందిన మంత్రిపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు శోచనీయమని అన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు నోటి నుంచి ఇటువంటి మాటలు రావడం మంచిది కాదని అన్నారు. చంద్రబాబుకి వయస్సు పెరిగింది కానీ బుద్ధి పెరగలేదని పేర్కొన్నారు. రైతులు దగ్గర ఒక్క గింజ ధాన్యం వదలకుండా కొనుగోలు చేస్తున్నా మంత్రి మీద, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మీద నోరు పారేసుకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీను, డీసీఎంఎస్ డైరెక్టర్ సుబ్బరాజు , కె ఇల్లిందల పర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, సత్తి వెంకట రెడ్డి, ఎంపీటీసీలు మంగెన రామానాయుడు, పాలా పాలేశ్వరరావు, జెసీఎస్ దినేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు

- 40డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- జిల్లాలో పెరిగిన వేసవితాపం
- ఉక్కబోత, వడదెబ్బ నుంచి జాగ్రత్తలు తప్పనిసరి



అత్తిలిలో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

అత్తిలి: భానుడు భగ్గుమంటున్నాడు. పగటిపూట తీవ్రమైన ఎండలతో సెగలు కక్కుతున్నాడు. అర్ధరాత్రి నుంచి వేకువ జామున వరకు కాస్తంత చల్లటి వాతావరణం ఏర్పడటంతో కొంత ఉపసమనం కల్పిస్తుంది. గత నాలుగురోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. అత్తిలి, తణుకు, ఇరగవరం మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు అయింది. రాబోయే రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటి తెలిపింది. ఈ నెల చివరివారం వరకు గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీల వరకు నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భానుడి ప్రతాపానికి బెంబేలెత్తే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. వేకువ జామునుంచే సూర్యుడు భగభగ మండుతుండంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం 12గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. రోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండడంతో వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. ఉదయం పది గంటలకే ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్, పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రాకూడదని చెబుతున్నారు. వదులుగా ఉండే వస్త్రాలు ధరించాలని, రోజుకు కనీసం ఏడు లీటర్ల నీటిని తీసుకుంటే వడదెబ్బ బారినుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులు, రోగులు మరింత జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.